క్లుప్తంగా

గ్యాస్ స్టవ్‌లకు ఉచితంగా సర్వీసింగ్



మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు వరద బాధితులకు హెచ్‌పీ మారుతీ గ్యాస్ కంపెనీ ఆధ్వర్యాన ముత్యాలంపాడులో గ్యాస్‌స్టవ్‌లకు ఉచితంగా సర్వీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతీ గ్యాస్ కంపెనీ అధినేత చెట్లపల్లి మారుతీప్రసన్న మాట్లాడుతూ.. వరద ముంపులో పాడైన గ్యాస్ స్టవ్‌లకు తాము ఉచితంగా సర్వీసింగ్ చేస్తున్నామన్నారు. ఈ సదవకాశాన్ని ముంపు బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఒక పక్క వరదలతో అల్లాడుతున్న ప్రజలను చోరీలు మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే చుట్టుగుంట బీఎస్ఎన్ఎల్ రోడ్డులోని బుజ్జి ఎలక్ట్రికల్స్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దొంగలు దుకాణం షట్టర్లు పగలకొట్టి సుమారు రూ. 20 వేలు విలువ చేసే వెండి వస్తువులు, నగదును చోరీ చేశారు. ఆదివారం షాపులోని సీసీ ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు దొంగలు శనివారం అర్ధరాత్రి 1.05 గంటల నుంచి 1.15 గంటల వరకు చోరీ చేసినట్లు రికార్డు అయ్యింది. దీనిపై దుకాణ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు వచ్చి పరిశీలించారు.

ఆందోళనలో కాల్వగట్లవాసులు



గుణదల(విజయవాడ తూర్పు): వరద ఉధృతికి కాల్వగట్లవాసులు ఆందోళనలో గడుపుతున్నారు. బుడమేరు నుంచి ఏలూరు కాల్వకు వరదనీరు వచ్చి చేరడంతో ప్రస్తుతం ఏలూరు కాల్వ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కాల్వ అంచును ఉన్న ఇళ్లు ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయి. నీటి ప్రవాహానికి ఇళ్ల ప్రహరీలు కూలిపోతున్నాయి. గుణదల హనుమాన్ నగర్, మధురానగర్, ఊర్మిళానగర్ వాసుల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. మరి కొన్ని ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని ఇళ్లల్లో బాత్రూం గోడలు పడిపోయాయి. ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో వీరు మరింత ఆందోళనకు గురవుతున్నారు.

కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా నరహరిశెట్టి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా నరహరిశెట్టి నరసింహారావు నియమితులయ్యారు. నగర అధ్యక్షుడిగా మూడోసారి ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనకు పదవి రావడంపై ఆ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

వైద్య రంగంలో కీలకంగా ఫిజియోథెరపీ



లబ్బీపేట(విజయవాడతూర్పు): వైద్య రంగంలో ఫిజియోథెరపీ కీలకంగా మారిందని ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం పురస్కరించుకుని నక్కలరోడ్డులోని విజయవాడ సూపర్ స్పెషాలిటీ ఫిజియోథెరపీ సెంటర్‌లో వేడుకలు, అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ సహచరులతో కలిసి కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ మెడనొప్పి, వెన్నునొప్పి, మోకీళ్ల, లిగమెంట్ సమస్యలతో పాటు, శస్త్ర చికిత్సల అనంతరం కండరాలు సాధారణ స్థితికి తీసుకురావడంలో ఫిజియోథెరపీ ఎంతో దోహద పడుతుందన్నారు. పలువురు ఫిజియోథెరపిస్టులు పాల్గొన్నారు.

అన్ని రకాల నొప్పులు నయం..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఫిజియోథెరపీ ద్వారా ఎన్నో రకాల నొప్పులు నయం చేయవచ్చని స్టార్ ఫిజియోథెరపీ హాస్పిటల్ న్యూరో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ప్రభుదాస్ పేర్కొన్నారు. ప్రపంచ ఫిజియోథెరపీ దినోత్సవం సందర్భంగా సత్యనారాయణపురంలోని హాస్పిటల్‌లో కేక్ కట్ చేసి ఫిజియోథెరపీ ప్రయోజనాలను వివరించారు. అన్ని రకాల నొప్పులను ఫిజియోథెరపీ చికిత్స ద్వారా నయం చేయవచ్చన్నారు. కండరాలు, ఎముకలు, నరాల మీద ఒత్తిడి పడటం వల్ల కలిగే నొప్పులు, వాటి వల్ల రక్త ప్రసరణ తగ్గి శరీరంలో కదలికలు తగ్గుతాయని చెప్పారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ డాక్టర్లు సువర్ణబాబు, దుర్గాప్రసాద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వరద వచ్చి.. కన్నీరు మిగిల్చింది



రాజీవ్‌నగర్‌లో వాటర్ బాటిళ్లు తీసుకుంటున్న ప్రజలు



నందమూరినగర్‌లోని ఓ క్యాటరింగ్ సెంటర్ దుస్థితి



నూజివీడు రోడ్డులో ఆహారం అందిస్తున్న దాతలు



తోటవారి వీధిలో రిపేర్‌కు ఫ్రిజ్ తరలింపు..



రాజీవ్‌నగర్‌లో నీరు పట్టుకుంటున్న యువకులు

బుడమేరుకు వరద వచ్చి నగర వాసులకు కన్నీరు మిగిల్చింది. గత ఎనిమిది రోజులుగా ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికీ కొన్ని కాలనీలు వరద ముంపులోనే ఉన్నాయి. మరి కొన్ని కాలనీల్లో వరద తగ్గుముఖం పట్టడంతో వరదతో బురదమయమైన ఇళ్లను, వ్యాపార సంస్థలను శుభ్రం చేసుకునే పనుల్లో వరద బాధితులు నిమగ్నమయ్యారు. స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న ఆహారం, తాగునీరే వారికి ఆధారమైంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్స్, విజయవాడ



వరద ముంపులోనే కండ్రిక



పైపుల్ రోడ్డు సెంటర్‌లో ఆహారం కోసం..

వరద బాధితులకు ఆపన్నహస్తం

స్వచ్ఛంద సంస్థలు, దాతల ఆపన్నహస్తం



అయోధ్యనగర్‌లో సామగ్రి అందజేస్తున్న రెవరెండ్ జయకుమార్ బాబు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని వరద బాధితులకు అంబవరం నీరా చారిటబుల్ ట్రస్టు, ప్రణతి గ్లోబల్ ఎడ్యుకేషనల్ టెక్నాలజీ ఫౌండేషన్ సభ్యులు తమవంతు సహకారం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి నగరంలోని వరద ప్రాంతాలకు వెళ్లి భోజనం, మంచినీటి బాటిళ్లతో పాటు, దుప్పట్లు, చీరలు, పంచెలు, బిస్కెట్లు అందిస్తూ వారిలో ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా సర్వం కోల్పోయిన ప్రజల్లో మనోస్థైర్యాన్ని నింపుతూ సైకాలజిస్టులు శ్రావణకుమారి, రమాదేవి, దాక్షాయని తదితరులు వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

పైపులరోడ్డులో పంపిణీ..

కంకిపాడు: పటమట అభ్యుదయ జూనియర్ కాలేజ్ 2002 బ్యాచ్ పూర్వ విద్యార్థులు వరద బాధితులకు తమ వంతు సహాయాన్ని అందించారు. సింగ్‌నగర్ పైపులరోడ్డు ప్రాంతంలోని వరద ముంపు ప్రాంతాలకు ఆదివారం పూర్వ విద్యార్థుల బృందం వెళ్లి 300 కుటుంబాలకు భోజనాలను అందించింది. కార్యక్రమంలో యు.నాగేశ్వరరావు, ఏ.దుర్గాప్రసాద్, ఎస్.శ్రీరాములు, ఎండీ గయాస్, పి.రమాదేవి, మగ్బుల్ తదితరులు పాల్గొన్నారు.

సోవర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన..

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అని సోవర్స్ మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ సల్లూరి జయకుమార్ బాబు అన్నారు. అయోధ్యనగర్‌లోని వరద బాధితులకు ఆదివారం సోవర్స్ మినిస్ట్రీస్ ఆధ్వర్యాన 500 మందికి నిత్యావసర సరుకులు, వంట సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ వంతు సామాజిక బాధ్యతగా వరదలో సర్వం కోల్పోయిన 500 మందికి నిత్యావసర సరుకులు వంటసామాగ్రి అందజేస్తున్నట్లు తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్,



సింగ్‌నగర్ పైపులరోడ్డులో వరద బాధితులకు ఆహారం పంపిణీ చేస్తున్న దాతలు

వైఎస్ఆర్ కాలనీ, పైపుల రోడ్డు, కొత్తూరు తాడేపల్లి, వెలగలేరు తదితర ప్రాంతాలలోని బాధితులకు సేవలు అందిస్తున్నామన్నారు. అంతకుముందు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విజయకుమారి, తాడేపల్లి దైవసన్నిధి చర్చి విశ్వాస బృందం, పాస్టర్ బెల్లంకొండ శివాజీ పాల్గొన్నారు..

నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ ఆధ్వర్యాన...

నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ ఆధ్వర్యాన అయోధ్యనగర్ నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో వరద బాధితులకు రూ.2 లక్షలు విలువ చేసే సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారి వ్యవసాయ సాధికారిక సంస్థ సీఈఓ బి. రామారావు, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం రవీంద్రనాథ్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొని సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్కాపురం కనకారావు, అన్నవరపు బ్రహ్మయ్య, నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణయ్య, ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కొమ్మువరపు భాను ప్రసాద్, కె.జానకిరామ్, జి.ఉమామహేశ్వరరావు, కె.నాగేంద్రరావు, ఎం.నరసింహారావు పాల్గొన్నారు.

సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యాన

సిటీ వైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ ఆధ్వర్యాన ఆదివారం వరద బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ముత్యాలంపాడు, బుడమేరు మధ్య కట్ట తదితర ప్రాంతాల్లో బాధితులకు సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సిటీవైడ్ ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ నగర అధ్యక్షుడు డి.మురళీకృష్ణంరాజు, నున్న శివనాగేశ్వరరావు, అప్పలరాజు, సుబ్బారావు, సాయిమనీష్ పాల్గొన్నారు.

వరద బాధితులకు అన్నదానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరద బాధితులకు ముత్యాలంపాడు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు నగరపాలకసంస్థ పాఠశాలలో ఆదివారం అన్నదానం జరిగింది. కార్యక్రమంలో 31వ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న రామారావు, రవీంద్రనాథ్‌బాబు తదితరులు



చిన్నారులకు బిస్కెట్లు, పాలు అందజేస్తున్న దాతలు



భోజనాలు వడ్డిస్తున్న కార్పొరేటర్ శిరీష, బాషా తదితరులు

డివిజన్ కార్పొరేటర్ పెనుమత్స శిరీష ముఖ్య అతిథిగా పాల్గొని భోజనాలు వడ్డించారు. వైఎస్సార్‌సీపీ బాపట్ల నాయకులు బాషా, బాజీ, నాయకులు రుద్రరాజు సుబ్బరాజు, పెనుమత్స పట్టాభిరామరాజు, పెనుమత్స సత్యం పాల్గొన్నారు.

పాలు, బిస్కెట్లు పంపిణీ

విజయవాడస్పోర్ట్స్: చిగుర మానసిక దివ్యాంగుల సంస్థలోని 200 మంది చిన్నారులకు సెయింట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ బిస్కెట్లు, పాలు, క్యాండిల్స్, మాస్కులను ఆదివారం పంపిణీ చేసింది. వరద బాధితుల సహాయార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు పెరికె వరప్రసాదరావు తెలిపారు. త్వరలో పలు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు బుల్ల మేరికుమారి, బోడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగర పరిధిలో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశించారు. ఆయన ఆదివారం విజయ టాకీస్ వద్ద కుర్మయ్య వంతెనలో వ్యర్థాలను చూశారు. వాటిని తొలగించాలని చెప్పారు. అనంతరం ఆయన అజిత్‌సింగ్‌నగర్, గురునానక్ కాలనీ రోడ్, రమేష్ హాస్పిటల్ రోడ్, అమ్మ కల్యాణ మండపం ప్రాంతం, సిద్ధార్థ కాలేజీ, విజయ టాకీస్ తదితర ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రజల నుంచి వ్యర్థాల సేకరణ ప్రతిరోజూ జరగాలని, వాటిని ఎప్పటికప్పుడు అజిత్‌సింగ్‌నగర్‌లోని ఎక్సెల్‌ప్లాంట్‌కు తరలించాలని, అక్కడ నుంచి జిందాల్ ప్లాంట్‌కు తరలిస్తూ వ్యర్థ నిర్వహణ చేయాలన్నారు. వరద ప్రభావం లేని మిగిలిన 32 వార్డుల్లో కూడా పారిశుద్ధ్య కార్మికులు శుభ్రంగా ఉంచాలని చెప్పారు. ప్రజలు కూడా పారిశుద్ధ్య సిబ్బందికి సహకరించాలన్నారు.



అజిత్‌సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ముంపులోనే పలు కాలనీలు

విజయవాడస్పోర్ట్స్: బుడమేరు వాగు పరిసరాల్లోని నందమూరి నగర్, భరతమాత కాలనీల్లో వరద ప్రవాహం ఆదివారం కొనసాగింది. రోడ్లపై రెండు నుంచి మూడు అడుగుల ఎత్తులో ప్రవహిస్తున్న నీటిలోనే ఆయా కాలనీల ప్రజలు రోజువారీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 2, 3, 4 తేదీల్లో ఏడు అడుగుల ఎత్తులో నీరు ప్రవహించడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకున్నారు. శనివారం వరద తగ్గిన నేపథ్యంలో ప్రజలు ఒక్కొక్కరుగా ఇళ్లలోకి చేరుకున్నారు. అయితే మోకాళ్ల లోతు నీళ్లలోనే ఆదివారం రోజువారీ కార్యకలాపాలు నిర్వహించుకున్నారు. నందమూరినగర్ శివారులోని బుడమేరు గట్టు వద్ద ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయి. ఆ ప్రాంతంలో ఇంకా ఆరు అడుగుల ఎత్తులో నీటి ప్రవాహం కొనసాగుతుండటంతో అక్కడి ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

రాజీవ్‌నగర్‌లోనూ..

పాయకాపురం(విజయవాడరూరల్): గత ఎనిమిది రోజులుగా రాజీవ్‌నగర్, సుందరయ్యనగర్‌లు ముంపులోనే ఉన్నాయి. న్యూ రాజీవ్‌నగర్, ఓల్డ్ రాజీవ్‌నగర్‌లోని ఇళ్లల్లో మూడు అడుగుల మేర వరద నీరు ఉండడంతో ప్రజలు ఇళ్లలోకి వెళ్లలేని పరిస్థితి. నీరు నిల్వ ఉండటంతో ఒండ్రు పేరుకుపోయి ఇంటిలో ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులు పాడైపోయి ఒక్కో ఇంట్లో వేలాది రూపాయల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోతున్నారు. ఫ్రిజ్‌లు, టీవీలు, కుక్కర్లు, డబుల్‌కాట్ మంచాలు, ఇలాంటివి రూపాయి రూపాయి కూడబెట్టుకొని కొనుగోలు చేసుకొని వాడుకొనే వస్తువులు ఇంటిలోనే వదిలేసి కట్టుబట్టలతో వెళ్లడంతో సామగ్రి పాడైపోయాయి. పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన ఈ ప్రాంతంలోని ప్రజానీకం ఈఎంఐ చెల్లింపులతో కొనుగోలు చేసినవి ఉన్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లల్లో ఉన్న నీటిని ప్రభుత్వం మోటర్ల ద్వారా తొలగించాలని బాధితులు కోరుతున్నారు.



రాజీవ్‌నగర్‌లో మునిగి ఉన్న ఇళ్లు



నందమూరినగర్‌లో పారుతున్న వరద నీరు

పున్నమరాజు సామాజిక సేవలు ఆదర్శనీయం

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు పున్నమరాజు ఎన్వీ మురళీకృష్ణ సామాజిక సేవలను ఆదర్శంగా తీసుకోవాలని కళాపోషకుడు గోళ్ల నారాయణరావు తెలిపారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, శ్రీ కేవీ బ్రహ్మానందరావు కళా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం శాస్త్రీయ సంగీత కచేరి, సంగీత విద్వాంసుడు పున్నమరాజు మురళీ కృష్ణకు ఆత్మీయ సత్కార కార్యక్రమం, సినీ సంగీత విభావరి నిర్వహించారు. నారాయణరావు మాట్లాడుతూ తిరుపతిలోని మానసిక దివ్యాంగుల కేంద్రం ఆచార్యులుగా విశిష్టమైన సేవలను అందిస్తున్నారన్నారు. సంగీత విద్వాంసుడు బ్రహ్మానందరావు మాట్లాడుతూ.. కళాకారులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, బోడి ఆంజనేయరాజు, సింగంశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు. శాస్త్రీయ సంగీత కచేరీలో భాగంగా సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు సంప్రదాయ కీర్తనలను తిరుపతికి చెందిన బాలాజీ అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. నిర్వాహకులు పున్నమరాజును ఆత్మీయంగా సత్కరించారు.



పేద విద్యార్థినికి మానవత ఆర్థిక సాయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేద విద్యార్థినికి ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. స్థానిక ఏలూరురోడ్డుకు చెందిన బీఎస్సీ విద్యార్థిని కేఎస్వీ పార్వతి కుటుంబం ఆర్థిక సమస్యలతో కాలేజీ ఫీజు చెల్లించలేక ఇబ్బందులు పడుతోంది. ఈ నేపథ్యంలో వారు మానవత సంస్థను ఆశ్రయించడంతో దాతలు వెంటనే స్పందించి రూ. 40,116 ఆర్థిక సాయాన్ని ఆమెకు అందించారు. మానవత కార్యాలయంలో ఈ మొత్తాన్ని దాతలు, మానవత సభ్యులు విద్యార్థినికి అందించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా తన చదువు అర్ధాంతరంగా ఆగిపోతుందని ఎంతో ఆందోళన చెందానని, కాలేజీ ఫీజుకు డబ్బు చెల్లించిన మానవత సభ్యులకు రుణపడి ఉంటానని విద్యార్థిని కృతజ్ఞతలు తెలిపింది. మానవత సంస్థ రాష్ట్ర కన్వీనర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మారుబోయిన కోటేశ్వరరావు, సభ్యులు గంటా సత్యనారాయణ, గూడపాటి జయరామచంద్రరావు, పాబోలు గణేష్, ఇందిరాదేవి, వడ్డి రాజేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, పొట్లూరి శేషాచలం, రేవిణికెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం వినాయక చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణనాథుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు ఆకాంక్షించారు. వినాయక చవితి పురస్కరించుకుని శనివారం ఆయన తన స్వగృహంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 30వ డివిజన్ వినాయకనగర్‌లో ఉత్సవాలలో భాగంగా సర్వీస్ ఫస్ట్ కంపెనీ ఆధ్వర్యాన చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. దావు బుచ్చయ్యకాలనీలో చవితి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దావు బుచ్చయ్యకాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి కనకారావు పాల్గొని పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వినాయకనగర్‌లో బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

అసత్య ప్రచారాలు చేయటం సరికాదు

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



పటమట(విజయవాడ తూర్పు): వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడానికి చర్యలు చేపట్టామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. కొందరు వ్యక్తులు కావాలనే తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, వారంరోజులుగా నగరంలోని ముంపు ప్రాంతాల్లో అధికారులతో కలిసి పర్యటించానని తెలియజేశారు. సామాజిక మాధ్యమాలలో మేయర్ మిస్సింగ్ అని పోస్టులు పెడుతున్నారని, అలాంటివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరద ముంపుతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఇలాంటి దుర్మార్గపు పోస్టులు పెట్టడం సరైన విధానం కాదని హితవు పలికారు. తన ఇల్లు కూడా వరద ముంపునకు గురైనా ప్రజా శ్రేయస్సు కోరుతూ నగర వ్యాప్తంగా అధికారులతో కలిసి బాధితులను పరామర్శించానని, వీఎంసీ ద్వారా అవసరమైన సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు.